సాక్షి
వరంగల్
శుక్రవారం | 30 | జూన్ | 2023



ఐసెట్‌లో 82.78 శాతం ఉత్తీర్ణత
రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, కేయూ వీసీ రమేష్ విడుదల చేశారు. - 8లో



జల్సాలకు అలవాటు పడి..
జల్సాలకు అలవాటుపడిన యువకులు డబ్బు సరిపోకపోవడంతో అడ్డదారులు తొక్కారు. ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36°/26°
జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురుస్తాయి. రాత్రి ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

1001 రకం ధాన్యాన్ని సాగు చేయొద్దు



ఖానాపురం : వానాకాలంలో రైతులు 1001 రకం ధాన్యాన్ని సాగు చేయొద్దని, రైస్‌మిల్లర్లకు రైతులు సహకరించాలని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి తక్కళ్లపల్లి యుగేంధర్‌రావు, నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు కోరారు. మండలంలోని పాకాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మిల్లర్ల వద్ద ఇప్పటికే 80 శాతం దొడ్డు ధాన్యం పేరుకుపోయి ఉందన్నారు. 1001 రకానికి బదులుగా ఇతర ఏ ధాన్యాన్ని సాగు చేసినా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. 1001 రకాన్ని బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి పంపే క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎఫ్‌సీఐ తీసుకోకపోవడంతో మిల్లుల్లోనే ధాన్యం పేరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం మిల్లుల్లో ఉన్న ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో మిల్లర్లు శివకుమార్, భూపాల్‌రావు, రాజు, జైపాల్‌రెడ్డి, ఈశ్వరయ్య, కృష్ణమూర్తి, శ్రీనివాస్, సత్యనారాయణ, రాంబాబు, జైపాల్‌రెడ్డి, అశోక్, మాధవ్, తిరుపతి, రవి, నరేందర్, రవి, ప్రణయ్ పాల్గొన్నారు.

దళితులకు రక్షణ లేదు

వర్ధన్నపేట : భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పుల నేపథ్యంలో దళితులకు రక్షణ లేకుండా పోతోందని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం(డీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి అన్నారు. గురువారం డీఎస్ఎస్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి తుమ్మల కిషన్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌లో ఆజాద్ చంద్రశేఖర్ భీమ్ ఆర్మీ సంస్థను ఏర్పాటు చేసి దళిత బహుజనులను ఏకం చేసి వారి హక్కులను సాధించుకునేలా చేశాడన్నారు. దళితుల సమస్యల కోసం పోరాడుతున్న చంద్రశేఖర్ ఆజాద్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపి హతమార్చేందుకు కుట్ర చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం దళితులపై దాడులను అరికట్టలేక విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా దళిత బహుజనులపై దాడులను అరికట్టకపోతే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలవుతుందని ఆయన హెచ్చరించారు.

వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలి



కాకోజీ సెంటర్ : రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన మొదటి వేతన సవరణ కమిషన్ గడువు ఈనెల 30తో ముగుస్తున్నందున వెంటనే రెండో వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ)ను ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సుబేదారి ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన డీటీఎఫ్ వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి వేతన సవరణ కమిషన్ సిఫార్సుల అమలులో జాప్యం కారణంగా ఉపాధ్యాయ, ఉద్యోగులు లక్షలాది రూపాయలు నష్టపోయారని పేర్కొన్నారు. మళ్లీ అలా కాకుండా వెంటనే రెండో వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి, మధ్యంతర భృతి విడుదల చేయాలని సూచించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎ.గోవిందరావు, కె.యాకయ్య, అధ్యాపక జ్వాల సంపాదకుడు పి.సుదర్శన్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రవీందర్, నరసింహులు, కొమ్మయ్య, రామస్వామి, లింగారెడ్డి, మహేందర్‌రెడ్డి, జాన్‌నాయక్, అరుణాదేవి, రఘువీర్, రమేష్, బాలాజీ, అశోక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: తెలంగాణలోని యూనివర్సిటీల్లో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ కోరింది. గురువారం కేయూకు వచ్చిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రిని కలిసి జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. లింబాద్రిని ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా కొనసాగిస్తూ.. మరో మూడేళ్లు కొనసాగిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బీరప్పకు బోనాలు



చెన్నారావుపేటలో బోనాలతో ఆలయానికి వెళ్తున్న కురుమ కులస్తులు

చెన్నారావుపేట : ఆషాఢ మాస తొలిఏకాదశి సందర్భంగా జిల్లాలో కురుమలు భక్తిశ్రద్ధలతో గురువారం బీరప్పకు బోనాలు సమర్పించారు. జిల్లా కేంద్రంతోపాటు వర్ధన్నపేట, నర్సంపేట తదితర ప్రాంతాల్లో బోనాలను బీరప్ప ఆలయాలకు తీసుకెళ్లి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

భక్తిప్రపత్తులతో బక్రీద్



ఖిలావరంగల్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బక్రీద్ పర్వదినాన్ని జిల్లాలో ముస్లింలు గురువారం భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సమైక్యత, శాంతి కోసం అందరూ కలిసి మెలిసి జీవించాలని మత పెద్దలు బోధించారు. అదేవిధంగా మేకలు, గొర్రెల మాంసాన్ని పేదలకు పంపిణీ చేశారు.
- సాక్షి నెట్‌వర్క్

వానొస్తే ఆగమాగమే..

- నర్సంపేటలో చినుకు పడితే ప్రజలకు తప్పని తిప్పలు
- డ్రెయినేజీ లేక చెరువులా గెస్ట్‌హౌస్–మార్కెట్ రహదారి
- ఎన్టీఆర్‌నగర్, కుమ్మరికుంటకు తప్పని ముంపు ముప్పు
- కొన్నివార్డుల్లో సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- దశలవారీగా అభివృద్ధి : పురపాలక విభాగం



ప్రతి వర్షాకాలంలో ముంపునకు గురయ్యే సర్వాపురం

సాక్షి, వరంగల్ : నర్సంపేట పట్టణంలో కనీస వసతులు కరువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నా మునిసిపాలిటీ పరిధిలో నివాసముంటున్న వారికి తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే చాలు పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు వార్డుల్లోని చాలావరకు కాలనీల్లో నీరు నిలుస్తోంది. 2011 వరకు నగర పంచాయతీగా ఉన్న నర్సంపేట మునిసిపాలిటీగా మారి 12 సంవత్సరాలు కావొస్తోంది. వార్డుల్లో సీసీరోడ్లు, సైడ్ డ్రెయినేజీల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో అందక తాగునీటికి జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే, ప్రభుత్వం చేపట్టిన పట్టణ ప్రగతిలో భాగంగా ఇక్కడ అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుంది.

ఇవీ సమస్యలు..

- 24 వార్డుల్లో చాలావరకు అంతర్గత రహదారులు ఇరుకుగా ఉన్నాయి. వీటిలో కొన్నింటిని విస్తరిస్తున్నారు. మెజారిటీ వార్డుల్లో మాత్రం రహదారులు, డ్రెయినేజీలు సరిగా లేవు. వర్షం పడితే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు.
- గెస్ట్‌హౌస్ నుంచి మార్కెట్‌కు వెళ్లే రోడ్డులో సెంట్రల్ డివైడర్ నిర్మించారు. ఇరువైపులా డ్రెయినేజీ లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.
- చిన్నపాటి వర్షానికే కుమ్మరికుంట లోతట్టు ప్రాంతం జలమయం అవుతోంది. దీంతో ప్రజలు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి నీరు చేరుతుండడంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా ఇప్పటికీ పరిష్కారం దిశగా అడుగుపడలేదు. అదే విధంగా హైవే సమీపంలోని సర్వాపురంలో ఆరేళ్లుగా వర్షాకాలంలో నీళ్లు నిలుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.
- రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో ఎన్టీఆర్‌నగర్ నీట మునుగుతుంది. నాటు పడవల ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికార యంత్రాంగం తరలించాల్సిన పరిస్థితి ఉంది. మాదన్నపేట చెరువు అలుగు పోసినప్పుడూ ఎన్టీఆర్‌నగర్‌కు నీళ్లు వస్తాయి. దాన్ని నిలువరించే దిశగా ఇంజనీరింగ్ ప్రయత్నం లేదు.
- మిషన్ భగీరథ పైపులైన్ కనెక్షన్లను ఇంకా 25 శాతం నివాసాలకు ఇవ్వాలి. ద్వారకపేట శివారులోని పాకాలవాగుపై నిర్మించిన మూడు ఫిల్టర్ బెడ్లు ఎనిమిదేళ్లుగా శిథిలావస్థకు చేరి పనిచేయడం లేదు. గెస్ట్‌హౌస్ నుంచి 6, 7,8 వార్డులకు మిషన్ భగీరథ సరఫరా కావాల్సి ఉంది.



డ్రెయినేజీలో ఉన్న మిషన్ భగీరథ నల్లా పైపులు



ఇరుకుగా ఉన్న సైడ్ కాల్వను శుభ్రం చేయడానికి ఇబ్బంది పడుతున్న పారిశుద్ధ్య కార్మికుడు

మెయిన్ పైపులైన్ పనుల ఆలస్యంతో నీరు అందడం లేదు.

దశలవారీగా అభివృద్ధి పనులు..



దశలవారీగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేస్తున్నాం. అయితే వర్షాకాలంలో ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వత పరిష్కారం దిశగా ఇంజనీరింగ్ ఆలోచనతో ముందుకెళ్తున్నాం. కొద్ది నెలలుగా 13, 15, 20, 5, 19, 18, 12, 1, 17, 8, 3 వార్డుల్లో సైడ్ డ్రెయినేజీలు , 2, 6,7 వార్డుల్లో సీసీరోడ్లు, 1,3 12, 21, 22 వార్డుల్లో కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 18వ వార్డులో ఆర్ఆర్ పనుల కింద సీనియర్ సిటిజన్స్ కమ్యూనిటీ భవనం, 12వ వార్డులో యానిమల్ కేర్ సెంటర్ భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. 10వ వార్డులో పట్టణ ప్రకృతి వనంతో పాటు ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ సమీకృత మార్కెట్, పశువధశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సమస్యలను పరిష్కరించే దిశగా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటున్నాం. మిషన్ భగీరథ నీరు త్వరలోనే అందుతుంది.
- గుంటి రజిని, చైర్‌పర్సన్, నర్సంపేట మునిసిపాలిటీ

మిషన్ భగీరథ నీరు అందించాలి



మిషన్ భగీరథ నీరు ఇంటికి సరఫరా కావడం లేదు. అంతర్గత రహదారుల్లో పైపులైన్ వేశారు. ఇళ్లలోకి పోయే పైపులైన్లకు జాయింట్ పెట్టారు. అయితే ఇంకా నీటి సరఫరా ప్రారంభం కాలేదు. చాలావరకు పైపులైన్లు మురుగు కాల్వల్లో పడుతున్నాయి. ఇప్పుడూ వర్షాకాలం కావడంతో మిషన్ భగీరథ నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఫిల్టర్ అయిన నీటిని తాగడం వల్ల ఇబ్బందులు ఉండవు.
- వనజ, నర్సంపేట

కాల్వలను శుభ్రం చేయాలి..



మురుగు కాల్వలు సరిగా లేవు. ఉన్నా కూడా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో అనారోగ్యం బారిన పడే అవకాశముంది. ఇప్పుడూ వానాకాలం కావడంతో మురుగునీరు పొటెత్తుతోంది. దోమలు వద్ధి చెంది వ్యాధులు వస్తాయి. మురుగు కాల్వలు ఎప్పటికప్పుడూ శుభ్రం చేస్తే అందరి ఆరోగ్యానికి మంచిది. అలాగే, డ్రెయినేజీ లేనిచోట్ల అవి నిర్మించాల్సిన అవసరం ఉంది.
- రాజమ్మ, నర్సంపేట

నేడు మానుకోటకు కేటీఆర్

- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. పోడు భూములకు పట్టాలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి సత్యవతి రాథోడ్
- పర్యటనను విజయవంతం చేయాలని పిలుపు



మహబూబాబాద్: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ శుక్రవారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను గురువారం మంత్రి సత్యవతి రాథోడ్ పరిశీలించారు. మానుకోట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో చేస్తున్న సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన అనంతరం ఆమె మాట్లాడారు. వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడి పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేస్తారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. మంత్రి వెంట ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్ చంద్రపవార్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్

మంత్రి పర్యటన షెడ్యూల్..

- ఉదయం 10.30 గంటలకు మానుకోటకు చేరుకుంటారు
- 10.30 గంటలకు మానుకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద రూ.50కోట్ల పనులకు శంకుస్థాపన, పైలాన్‌ను ఆవిష్కరిస్తారు.
- 11.00 గంటలకు ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ ప్రారంభోత్సవం
- 11.15 గంటలకు రామచంద్రాపురం కాలనీ సమీపంలో 200 డబుల్‌బెడ్రూం ఇళ్ల ప్రారంభోత్సవం
- 11.30 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభకు చేరుకుంటారు. మాట్లాడిన అనంతరం పోడు రైతులకు పట్టాల పంపిణీ.. లబ్ధిదారులతో మంత్రి భోజనం.
- 2.30 గంటలకు మానుకోట నుంచి మంత్రి హైదరాబాద్‌కు పయనమవుతారు.

షెడ్యూల్‌కు అనుగుణంగా నీటి విడుదల


- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : రాష్ట్రంలోని పంటల సాగు షెడ్యూల్‌కు అనుగుణంగా నీటిని విడుదల చేసినట్లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు.మండలంలోని పాకాలలో గురువారం కట్టమైసమ్మ వద్ద గురువారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగబంధం తూము వద్ద నీటిని విడుదల చేసి ఆయన మాట్లాడారు. వర్షాలతో సంబంధం లేకుండా పాకాల ఆయకట్టుకు గోదావరి జలాలను అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పంటల షెడ్యూల్ ప్రకారం కాకుండా నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా 40 రోజులు ఆలస్యంగా పంటలు సాగవుతాయన్నారు. రాష్ట్ర షెడ్యూల్‌కు అనుగుణంగా పంటలు సాగు చేయాలనే ఉద్దేశంతో ముందస్తు ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పాకాల సరస్సులో 16.3 ఫీట్లు, రంగాయ చెరువులో 10 ఫీట్లు, మాదన్నపేట చెరువులో 8 ఫీట్ల నీరు ఉందన్నారు. నార్లు పోసుకోవడానికి ముందస్తుగా నీటిని విడుదల చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఈ సామ్యేల్, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌బీఎస్ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఉమారాణి, నాయకులు లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, గుంటి కిషన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు మస్తాన్, వెంకన్న, భూస అశోక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతికి సంతాపం తెలిపారు.

అద్భుత దృశ్యం ఆవిష్కృతం



రాయపర్తి : ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సూర్యుడి చుట్టూ నీళ్ల వలయం, ఇంద్రధనుస్సు దృశ్యాలు కనువిందుచేశాయి. స్థానికులు వీటిని వీక్షించేందుకు ఆసక్తి చూపారు. మండలంలోని జగన్నాథపల్లిలో గురువారం ఉదయం కనిపించిన ఈ దృశ్యాలను యువకులు సెల్‌ఫోన్లలో బంధించారు.

నాడు నిలిచిన ప్రాణం.. నేడు పోయింది!

- బయ్యారంలో 2010లోనే సాయిచంద్‌కు గుండెపోటు
- ఆస్పత్రికి తరలించడంతో నిలిచిన ప్రాణం
- తాజాగా నాగర్‌కర్నూల్‌లో మరోసారి రావడంతో హఠాన్మరణం..
- విషాదంలో సహ కళాకారులు



బయ్యారంలో నిర్వహించిన ధూం... ధాంలో తోటికళాకారులతో సాయిచంద్ (ఫైల్)

బయ్యారం: గుండెపోటుతో గురువారం హఠాన్మరణం చెందిన గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్‌కు మహబూబాబాద్ జిల్లా బయ్యారంతో ప్రత్యేక అనుబంధం ఉంది. రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ సమయంలో బయ్యారానికి చెందిన కళాకారులు కొమిరె వెంకన్న, దేవరకొండ భిక్షపతి తదితరుల బృందంలో సాయిచంద్ సభ్యుడిగా కొనసాగారు. అలాగే.. బయ్యారానికి దగ్గరగా ఉన్న మిగతా కళాకారులు జయరాజ్, గిద్దె రామనర్సయ్య, మానుకోట ప్రసాద్, బండ వెంకన్న, మల్లేశం తదితరులతో కలిసి సాయిచంద్ ఈ ప్రాంతంలో ధూం..ధాం కార్యక్రమాల్లో పాల్గొనేవారు. 2010లో బయ్యారంలో రెండోసారి గుండెపోటు రావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే సహ కళాకారులు కొమిరె వెంకన్న తదితరులు సాయిచంద్‌ను ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఆ తర్వాత నుంచి గుండెకు సంబంధించిన సమస్యలు రాలేదని సహ కళాకారులు పేర్కొంటున్నారు.

మొదటిసారి 25 ఏళ్లకే గుండెపోటు..

తెలంగాణ ఉద్యమ సమయంలో మొదటిసారి 2009లో భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో 25 ఏళ్ల వయసులో సాయిచంద్ స్వల్ప లక్షణాలతో మొదటిసారి గుండెపోటుకు గురైనట్లు సహచర కళాకారులు తెలుపుతున్నారు.

పై స్థాయికి వెళ్లారనుకుంటే..

తమతో ఆడిపాడి తెలంగాణ సాధించిన సాయిచంద్.. తమ కన్నా పైస్థాయికి వెళ్లారనుకుంటే గుండెపోటుకు గురై.. పైకే వెళ్లిపోయారని సహచర కళాకారులు కన్నీటి పర్యంతమయ్యారు. భవిష్యత్‌లో మంచి నాయకుడిగా చూస్తామనుకున్న సాయిచంద్‌ను విగతజీవిగా చూడాల్సి వచ్చిందని కన్నీరుమున్నీరుగా విలపించారు.

సేవలను వినియోగించుకోవాలి

నర్సంపేట : గ్రూప్–4 పరీక్ష రాసే అభ్యర్థులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని నర్సంపేట డిపో మేనేజర్ ఐ.విజయమాధురి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ.. గ్రూప్–4 పరీక్ష రాసే అభ్యర్థులు, ఉద్యోగులకు జూలై 1వ తేదీ ఉదయం 4 నుంచి రాత్రి 7గంటల వరకు టీఎస్ ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు, ఉద్యోగులు టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి క్షేమంగా గమ్యస్థానం చేరుకోవాలని ఆమె కోరారు.

రూ.190.63 కోట్ల కేంద్రం నిధులు!

పెట్టుబడి వ్యయం కింద కేటాయింపు

- రోడ్లు, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు మంజూరు
- గ్రేటర్ వరంగల్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కింద రూ.100 కోట్లు
- ఉమ్మడి జిల్లాలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధిపై దృష్టి



భూపాలపల్లి జిల్లా భీష్మనగర్, జడలపేట గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న కాజ్‌వే



భూపాలపల్లి జిల్లా చిట్యాల.. మొగుళ్లపల్లి మధ్య గల రోడ్డు..



ఇంతకాలం నిధులు లేక పెండింగ్‌లో ఉన్న ధర్మసాగర్ వడ్డెర కాలనీ నుంచి ఎలుకుర్తి క్రాస్ వరకు రోడ్డు పరిస్థితి

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్‌లో వివిధ పథకాల కింద అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తెలంగాణ రాష్ట్రం కోసం ఆమోదించిన 79 ప్రాజెక్టుల కోసం రూ.2,102 కోట్లు మూలధనంగా ప్రకటించింది. 2023–24 సంవత్సరానికి మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రానికి ప్రత్యేక సహాయం పథకం కింద ఈ నిధులను ఆమోదించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్‌లో 10 ప్రాజెక్టులకు రూ.190.63 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.100 కోట్లు గ్రేటర్ వరంగల్‌లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు పేర్కొన్నారు. జనగామ మెడికల్ కాలేజీ అప్‌గ్రేడింగ్, ఫస్టియర్ క్లాసుల కోసం నిధులు ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న రోడ్లు, కాజ్‌వేల పూర్తికి కూడా నిధులు కేటాయించడంతో పెండింగ్ పనులు పూర్తి కానున్నాయి. జిల్లాల వారీగా ప్రాజెక్టులు, కేటాయించిన నిధుల వివరాలు..

- వరంగల్ మహానగరంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల కోసం రూ.100 కోట్లు..
- హనుమకొండ జిల్లా ధర్మసాగర్ నుంచి వేలేరు వయా సాయిపేట, మల్లికుదుర్ల రోడ్డు 0/0 కిలోమీటర్ల నుంచి 20/7 కి.మీ.ల వరకు సింగిల్ లేన్ నుంచి డబుల్ లేన్ రోడ్డుగా విస్తరణ, నిర్మాణం కోసం రూ.20 కోట్లు.
- హనుమకొండ జిల్లా మల్లారం నుంచి కన్నారం వరకు రోడ్డుకు రూ.6.60 కోట్లు..
- జనగామ జిల్లా ఇప్పలగూడెం కుర్చపల్లి బీటీ రోడ్డు నుంచి శివాజీ నగర్ వయా అక్కపల్లిగూడెం రోడ్డు కోసం రూ.5.75 కోట్లు
- జనగామలో గవర్నమెంట్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్, అప్‌గ్రేడింగ్ అటాచ్డ్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో మొదట సంవత్సరం క్లాసుల కోసం రూ.15 కోట్లు
- జనగామ జిల్లా చిన్నమడూరు నుంచి ధర్మగడ్డ తండా వయా పెద్దమడూరు దొడ్లబండ తండా రోడ్డు కోసం రూ. 6.38 కోట్లు
- జనగామ పీడబ్ల్యూడీ రోడ్డు దేవరుప్పుల నుంచి విస్నూరు వయా కొత్తగుడిసెలు, ధర్మపురం, మైలారం రూ.5 కోట్లు..
- పాలకుర్తి నుంచి కొడకండ్ల వయా వల్మిడి, ముత్తారం రోడ్డు కోసం రూ.6 కోట్లు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల నుంచి మొగుళ్లపల్లి వరకు 0/0 కి.మీ.ల నుంచి 7/0 కి.మీ.ల వరకు జడలపేట రోడ్డు, 0/0 కి.మీ.ల నుంచి 9/7 కి.మీ.ల వరకు రోడ్డు విస్తరణ, నిర్మాణం, బలపరచడం కోసం రూ.18 కోట్లు కేటాయించారు.
- మహబూబాబాద్ జిల్లా కోటిలింగేశ్వర స్వామి ఆలయం నుంచి చర్లపాలెం వయా పామాయిల్ ఫ్యాక్టరీ వరకు రోడ్డుకు రూ.7.90 కోట్లు.

క్లుప్తంగా

నా భర్తను బయటకు పంపండి..

● మానుకోట జైలు ఎదుట మహిళ హల్‌చల్

మహబూబాబాద్ రూరల్: తనపై నమోదైన ఓ కేసులో భాగంగా ఓ వ్యక్తి మానుకోట జిల్లా కేంద్రంలోని జైలులో ఉన్నాడు. కాగా, ఆ వ్యక్తిని బయటకు పంపించాలని అతడి భార్య గురువారం జైలు ఎదుట హల్‌చల్ చేసింది. అయితే బక్రీద్ సందర్భంగా సెలవు ఉంటుందని, ఈ రోజున ఖైదీలతో ములాఖత్ ఉండదని జైలు అధికారులు చెప్పినా వినిపించుకోలేదు. ఆందోళన కొనసాగిస్తూ తన భర్తకు బయటకు పంపించాలని, లేనిపక్షంలో పురుగుల మందు తాగుతానని బెదిరించింది. దీంతో జైలు అధికారులు.. పోలీసులకు సమాచారం అందించగా వారు జైలు వద్దకు వచ్చి ఆమెతో మాట్లాడారు. అతడి కేసు కోర్టు పరిధిలో ఉందని, మాట్లాడొచ్చుగాని బయటకు పంపమని చెప్పారు. తన భర్త జైలులో ఉండడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని సదరు మహిళ.. పోలీసులతో ఆవేదన వ్యక్తం చేసింది. కొంత సేపటి తరువాత పోలీసులు సర్దిచెప్పి ఆమెను ఇంటికి పంపించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా షూటర్ల ప్రతిభ

కాజీపేట రూరల్: హైదరాబాద్ గచ్చిబౌలి సెంట్రల్ యూనివర్సిటీలో ఇటీవల 9వ రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలు జరిగాయి. ఇందులో వరంగల్ రీ లోడ్ షూటింగ్ అకాడమీకి చెందిన షూటర్స్ ప్రతిభ కనబర్చి కేరళ త్రివేండ్రంలో ఆగస్టులో జరిగే సౌత్ జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పిస్టల్ ఈవెంట్ నేషనల్స్‌కు ఎంపికయ్యారు. షూటర్, వరంగల్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ పోలెపాక రజనీకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రీలోడ్ షూటింగ్ అకాడమీ కోచ్ (సీఐ ఐటీ కమిషనరేట్ హైదరాబాద్) అల్లూరి ప్రసన్నకుమార్ పిస్టల్ 10 మీటర్స్ సీనియర్స్ టీంలో గోల్డ్‌మెడల్, 25 మీటర్స్‌లో బ్రాంజ్ మెడల్ గెలిచారు. కాగా.. 10 మీటర్లలో వరంగల్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ పొలెపాక రజినికుమార్, పంజాబ్ ఆర్మీ గోడిశాల నవీన్‌గౌడ్, వరంగల్ 8 బీఎన్/ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ సుజాతదేవి, సంగెం చంద్రశేఖర్, కూచన సాయిప్రసాద్, బి.జ్యోతి, కొట్టి రాజీవ్, 10 మీటర్స్ జూనియర్స్‌లో దినకర్, గడ్డం కౌశల్, కార్తీక్, యశశ్వి పాల్గొని క్వాలిఫై అయి నేషనల్స్‌లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. కేరళ నేషనల్స్‌కు ఎంపికైన వరంగల్ రీలోడ్ షూటింగ్ అకాడమీ షూటర్స్‌ను కోచ్‌లు అల్లూరి ప్రసన్నకుమార్, మాళవిక బార్వ అభినందించారు.

పరిశోధనల కేంద్రంగా కేయూ..

● రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి
● యూనివర్సిటీలో ముగిసిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి

కేయూ క్యాంపస్: తెలంగాణలో ఒక్కో విశ్వ విద్యాలయం ఒక్కో ప్రత్యేకత కలిగి ఉందని, ఆసక్తి, చిత్తశుద్ధితో అనుకున్నది సాధించొచ్చునని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్ లింబాద్రి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగం , యూకే అబెర్విసిత్ యూనివర్సిటీ కొలబరేషన్‌లో క్యాంపస్‌లోని పరిపాలనాభవనం సెనేట్‌హాల్‌లో మూడురోజుల నుంచి ప్లాంట్ బయోటెక్నాలజీ 'జీనోమ్ ఎడిటింగ్' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్ గురువారం రాత్రి ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీలో మేధోపరంగా ముందుకెళ్తున్నారని, గొప్ప పరిశోధనల కేంద్రంగా కేయూ ఉందన్నారు. అందుకు ఉదాహరణ ఈ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ అన్నారు. కేయూ ఎంతోమంది మేధావులను అందించిందన్నారు. వారు కూడా వారి సామాజిక బాధ్యత మరవకుడా సమాజ హితానికి దోహదం చేశారన్నారు. కేయూ మాజీవీసీ విద్యావతి మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులు.. తమ ఆచార్యులు, సీనియర్లనుంచి కొత్త విషయాలు తెలుసుకోవాలన్నారు. యూకే ప్రతినిధి మార్కెట్ డెవలప్‌మెంట్ మేనేజర్ హరీశ్ లోకస్ మాట్లాడుతూ ఇరుదేశాల భాగస్వామ్యం బలోపేతం కావాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో చైర్మన్‌గా వ్యవహరించిన బయోటెక్నాలజీ విభాగం అడ్జంట్ ఆచార్యుడు సదానందం మాట్లాడుతూ ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించేందుకు ఎంతో కృషిచేశామని తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ టి శ్రీనివాస్‌రావు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి సురేశ్‌లాల్, సైన్స్‌డీన్ పి మల్లారెడ్డి, యూజీసీ కోఆర్డినేటర్ ఆర్ మల్లికార్జున్‌రెడ్డి, బయోటెక్నాలజీ విభాగం అధిపతి పి.శ్రీనివాస్, ఆర్గనైజర్ ఎస్ రామస్వామి, ప్రొఫెసర్ ఎ సదానందం, కన్వీనర్లు డాక్టర్ ఏవీ రావు, డాక్టర్ టి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉత్తమ పోస్టర్లను ప్రదర్శించిన బి మహేశ్‌కుమార్, గోవింద్ దయాకర్, వి అజయ్‌కుమార్, సుశ్వంత్‌కు, కె పల్లవి, అంజనీప్రియకు జ్ఞాపికలు అందజేశారు. బెస్ట్ ఓరల్ ప్రజెంటేషన్ చేసిన వారిలో పి ఆకాశ, ఎడ్ల హరి, ఎం అరుణ్‌కు అతిథులు జ్ఞాపికలను అందజేశారు. కాగా, గురువారం ఉదయం వివిధ ప్లీనరీ లెక్చర్లు, ముఖాముఖి చర్చా కార్యక్రమాలు జరిగాయి. కాగా, లింబాద్రిని సన్మానించారు

టీఎస్ ఐసెట్‌లో 82.78 శాతం ఉత్తీర్ణత



టీఎస్‌ఐసెట్ ఫైనల్ 'కీ' పాస్‌వర్డ్‌ను విడుదల చేస్తున్న లింబాద్రి, రమేశ్, తదితరులు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు గాను ఈ ఏడాది మే 26, 27 తేదీల్లో నిర్వహించిన టీఎస్ ఐసెట్ 2023 ఫలితాలను గురువారం కేయూలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్ లింబాద్రి , కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ విడుదల చేశారు.వరంగల్ రీజినల్ సెంటర్ పరిధిలో 10 పరీక్షాకేంద్రాల్లో 7,824మంది అభ్యర్థులు రాయగా 6,477మంది ఉత్తీర్ణత (82.78శాతం) సాధించారు.ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. వచ్చేనెలలో ఎంబీఏ, ఎంసీఏలో ప్రవేశాలకు షెడ్యూల్‌ను విడుదల చేస్తామన్నారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు, టీఎస్‌ఐసెట్‌కన్వీనర్ ఆచార్య పి వరలక్ష్మి, ప్రొఫెసర్లు ఎస్ నర్సింహాచారి, అమరవేణి, కృష్ణమాచారి, సత్యవతి, ఎన్ వాసుదేవ రెడ్డి, వెంకయ్య పాల్గొన్నారు.

ఓవైపు డిగ్రీ పరీక్షలు..
మరోవైపు పీజీ కోర్సుల్లో ప్రవేశపరీక్షలా

కేయూతోపాటు వివిధ యూనివర్సిటీల్లో డిగ్రీ 6వ సెమిస్టర్‌తోపాటు వివిధ సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండగా ఈనెల 30నుంచి పీజీకోర్సుల్లో ప్రవేశాలకు ప్రవేశపరీక్షలు నిర్వహిస్తున్నారని, అయితే డిగ్రీ పరీక్షలు రాస్తూనే సీపీ గేట్ పరీక్షలు ఎలా రాస్తారని విద్యార్థుల ఇబ్బందులపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్ లింబాద్రిని 'సాక్షి' ప్రశ్నించింది. దీనికి ఆయన స్పందిస్తూ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీపీ గెట్ 2023ను వాయిదావేసే అవకాశం లేదని, అది తమ పరిధిలో లేదన్నారు. ప్రవేశ పరీక్షల నిర్వహణ ఓ ఏజెన్సీ ద్వారా జరుగబోతోందన్నారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీల పరిధిలో సీపీ గెట్ పరీక్షల తేదీలను దృష్టిలో ఉంచుకొని డిగ్రీ పరీక్షల్లో రీషెడ్యూల్ చేసుకుని యూనివర్సిటీ అధికారులు పరీక్షలు నిర్వహించుకోవాల్సింటుందని వివరణ ఇచ్చారు.

నేటి నుంచి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాల పరిధిలోని అన్ని పీజీ కోర్సుల్లో 2023-2024 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు గాను ఉస్మానియా యూనివర్సిటీ.. ఈనెల 30వతేదీ నుంచి కామన్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రెన్స్ టెస్టు (సీపీగెట్) ప్రవేశ పరీక్షలను నిర్వహించబోతుంది. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్‌జిల్లా కేంద్రంలో 4 , ఖమ్మంలో 5 , ఆదిలాబాద్‌లో 1 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కంప్యూటర్ బేస్ట్ ఆన్‌లైన్‌లోనే ఈ ప్రవేశ పరీక్షలు కొనసాగుతాయని సీపీగెట్ కన్వీనర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పాండురంగా రెడ్డి గురువారం తెలిపారు. 45 పీజీకోర్సుల్లో ఈ ప్రవేశ పరీక్షలు ఈనెల 30నుంచి జూలై 10వతేదీ వరకు జరుగుతాయన్నారు. కేయూ పరిధిలో వరంగల్‌లో 7,117మంది, ఖమ్మంలో 5,133మంది, ఆదిలాబాద్‌లో 1646 మంది మొత్తం.. 13,896 మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారు. మూడు సెషన్లలో ప్రవేశపరీక్షలు జరుగుతాయి. షెడ్యూల్ ప్రకారం ఆయా రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 2. 30గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు నిర్దేశించిన పరీక్ష సమయం ప్రకారం ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కన్వీనర్ పాండురంగారెడ్డి కోరారు.

ఓరుగల్లులో బీజేపీ 'విస్తారక్'లు!

● పార్టీ పరిస్థితి, కేడర్ పనితీరుపై అధ్యయనం
● వచ్చే నెల 7 వరకు పర్యటన.. బూత్, శక్తి కమిటీలతో భేటీ

సాక్షిప్రతినిధి, వరంగల్: ఎన్నికల సమయం ఆసన్నమవుతుండడంతో బీజేపీ తన కార్యాచరణకు పదును పెట్టింది. వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యమంటున్న ఆ పార్టీ అధిష్టానం 'విస్తారక్'లను రంగంలోకి దింపింది. ఉమ్మడి వరంగల్‌లో రాజకీయ పార్టీల తాజా పరిస్థితి, బీజేపీ నేతలు, కార్యకర్తల పనితీరు, ప్రజల్లో పార్టీకున్న అనుకూల, ప్రతికూల పరిస్థితులపై అధ్యయనం కొనసాగుతోంది. ఈ నెల 28 నుంచి ఉమ్మడి జిల్లాలో కార్యక్రమాలను మొదలెట్టిన వీరు.. జూలై 5 వరకు 7 రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారు. పోలింగ్ బూత్ కమిటీలు, శక్తి కమిటీలను కలిసి పార్టీని సంస్థాగతంగా నిర్మాణం చేయడంతోపాటు, రాజకీయ చైతన్యం కల్పిస్తారు. కమిటీలు లేని పోలింగ్ బూత్‌లలో కమిటీలు ఏర్పాటు చేస్తారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పార్టీ పరిస్థితిని తెలుసుకుంటారు. అధికారంలోకి రావడానికి ఏం చేయాలో ప్రజలనుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. ఈ సమాచారాన్ని క్రోడీకరించి పార్టీ జాతీయ నాయకత్వానికి అందజేస్తారు.

ఇటీవల విస్తారక్‌లకు శిక్షణ

మధ్యప్రదేశ్ రాష్ట్రం బోపాల్‌లో ఈ నెల 24, 25 తేదీల్లో విస్తారక్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముగింపు శిక్షణలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొని వీరికి దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాకు గాను 152 మంది విస్తారక్‌లు రైల్ ద్వారా కాజీపేటకు చేరుకున్నారు. చేరుకున్న వెంటనే వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌ల్లోకి వెళ్లి అధ్యయనం మొదలెట్టారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారు ఎక్కువ సంఖ్యలో విస్తారక్‌లుండగా, కర్ణాటక, కేరళతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కొందరున్నారు.

రిటైర్డ్ ఎంపీడీఓ హత్య కేసులో సీన్ రీ కన్‌స్ట్రక్షన్?

● నేడు కోర్టుకు అప్పగింత

జనగామ: బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్య హత్య కేసులో పోలీసులు గురువారం సీన్ రీ కన్‌స్ట్రక్షన్ నిర్వహించినట్లు తెలిసింది. వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు అనుమతి మేరకు జనగామ సబ్‌జైలులో ఉన్న నిందితులు గిరబోయిన అంజయ్యతో పాటు మరో ఇద్దరు భాస్కర్, శ్రీకాంత్‌ను ఈ నెల 28వ తేదీన పోలీసులు తమ కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. రెండు రోజుల నుంచి సీపీ ఆధ్వర్యంలో లోకల్ పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ బృందం నిందితులను విచారిస్తున్నారు. 28వ తేదీన ముగ్గురిని విచారించిన పోలీసులు.. 29వ తేదీ ఉదయం హత్యకు సంబంధించిన మరిన్ని విషయాలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయికి వెళ్లినట్లు సమాచారం. రిటైర్డ్ ఎంపీడీఓ కిడ్నాప్‌నకు ప్లాన్.. ఆ తర్వాత కారులో ఎక్కడ నుంచి ఎక్కడి తీసుకెళ్లారు.. చంపిన ప్రదేశం తదితర వివరాలు తెలుసుకునేందుకు నిందితులు భాస్కర్, శ్రీకాంత్‌తో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. మృతదేహం వెలుగు చూసిన చంపక్ హిల్స్ క్రషర్ మిషన్ ఏరియా నీటి కుంటతో పాటు కిడ్నాప్ చేసిన తర్వాత నిందితులు ప్రయాణించిన దారిలో పోలీస్ టీం మరోసారి పరిశీలన జరిపినట్లు తెలిసింది. కాగా, శుక్రవారంతో నిందితుల పోలీసు కస్టడీ ముగుస్తుండగా.. ముగ్గురికి మెడికల్ చెకప్ చేయించిన అనంతరం ఉదయం కోర్టులో హాజరుపరుచనున్నారు.

ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని యువకుడి మృతి



నాగరాజు(ఫైల్)

వరంగల్: ఏనుమాములు-నర్సంపేట 100ఫీట్ల రహదారిలోని ఎస్ఆర్ నగర్ సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్న ఘటనలో 14వ డివిజన్ ఎస్‌టీఆర్ నగర్‌కు చెందిన జంగిలి నాగరాజు(23) మృతి చెందినట్లు ఏనుమాముల ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్‌టీఆర్ అక్వా వాటర్ ప్లాంట్‌లో ట్రాలీ డ్రైవర్‌గా పనిచేస్తున్న నాగరాజు బుధవారం సాయంత్రం లేబర్‌కాలనీలో పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో శుభం గార్డెన్ ఎదుట రోడ్డుపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా పార్క్ చేసిన ట్రాక్టర్ ట్రాలీని వెనుకనుంచి ఢీకొన్నాడు. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే నాగరాజును ఎంజీఎంకు తరలించగా అదేరోజు రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం..



ఉజ్జన్ (ఫైల్)

నర్సంపేట రూరల్ : ఉరివేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం నర్సంపేట మండలం మహేశ్వరంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మహేశ్వరం శివారు మహేశ్వరం తండాకు చెందిన గుగులోతు ఉజ్జన్ (50) దినసరి కూలీ. ఖానాపురం మండలం గంగిదేవి తండాకు చెందిన సాంబలక్ష్మితో ముప్పై ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు రాజ్‌కుమార్, కూతురు మంజుల ఉన్నారు. అయితే కుటుంబ కలహాలతో కొంతకాలం క్రితం సాంబలక్ష్మి పుట్టింటి వద్దే పిల్లలతో ఉంటుంది. ఉజ్జన్ ఒక్కడే కూలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం శ్మశాన వాటిక వద్ద ఉజ్జన్ ఉరివేసుకుని కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేటకు తరలించారు. కాగా, తన భర్త మృతిపై అనుమానం ఉందని సాంబలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ పులి రమేశ్ తెలిపారు.

ఉజ్జన్ మృతి ఆత్మహత్య.. హత్యా?

కాగా, ఇటీవల గ్రామంలో ఓ వ్యక్తి ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. ఆ వ్యక్తి ఇంటి పక్కన ఉన్న అరుగులపై నిద్రించిన ఉజ్జన్‌పై వారికి అనుమానం వచ్చింది. ఆ వ్యక్తి ఉజ్జన్‌ను నిలదీశారని, బుధవారం తీవ్రంగా కొట్టారని పలువురు చెబుతున్నారు. ఈ క్రమంలో ఉజ్జన్‌ను వారే చంపి ఉరివేసి ఉంటారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, సాంబలక్ష్మి ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన సతీశ్, మధుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో విద్యార్థి ..



వంశీ కృష్ణ(ఫైల్)

కాజీపేట: పదో తరగతి ఫెయిల్ అయ్యాననే బాధతో ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం కాజీపేట 47వ డివిజన్ బాలాజీనగర్ కాలనీ జరిగింది. కాలనీకి చెందిన బొబ్బూరి వంశీ కృష్ణ (16) పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. కొద్ది రోజులుగా ఇంటి వద్ద ఉంటున్న వంశీకృష్ణ మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీని పై తండ్రి సుబ్బారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

రామన్నగూడెంలో చికిత్స పొందుతున్న వ్యక్తి..



సాంబయ్య (ఫైల్)

ఏటూరునాగారం: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెంలో జరిగింది. గ్రామానికి చెందిన గద్దల సాంబయ్య(49) ప్రభుత్వ ఉద్యోగి. ఈయన జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, సంవత్సరం నుంచి కళాశాలకు వెళ్లకుండా మద్యానికి బానిసైన సాంబయ్య.. అందరితో గొడవపడుతూ చనిపోతానని బెదిరించేవాడు. ఈ క్రమంలో ఈనెల 28వ తేదీన సాయంత్రం కుటుంబ సభ్యులతో గొడవపడి మద్యం మత్తులో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య రమాదేవి, కుమారులు పవన్ కల్యాణ్, ప్రణయ్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్సై శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఫాసిస్ట్ దాడులను ఎదుర్కోవాలి

● వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



నిరసన తెలుపుతున్న వీసీకే పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు

హన్మకొండ: దేశంలో హేతువాదులు, అంబేడ్కర్ వాదులు, ప్రగతిశీలవాదులపై సనాతన ఫాసిస్ట్, ఆర్ఎస్ఎస్ లాంటి మతోన్మాద శక్తులు చేస్తున్న దాడులు, హత్యలను ప్రగతిశీలవాదులు ఐక్యతతో ఎదుర్కోవాలని 'విముక్త చిరుతల కక్షి' (వీసీపీ) పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు, ఆజాద్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్‌పై ఆర్ఎస్ఎస్, బీజేపీలు హత్యాయత్నానికి పాల్పడ్డాయని తెలిపారు. చంద్రశేఖర్ ఆజాద్‌పై జరిగిన హత్యాయత్నాన్ని ఖండిస్తూ హన్మకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ప్రజాసంఘాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలు, ప్రజాస్వామికవాదులపై బీజేపీ చేస్తున్న మారణహోమాన్ని ప్రజలు కలసికట్టుగా ఎదుర్కోవాలన్నారు. బీసీ స్టడీ ఫోరం వ్యవస్థాపక చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలో లేనప్పటి నుంచే ప్రశ్నించే ప్రగతిశీలవాదులు, హేతువాదులు, అంబేడ్కర్ వాదులను హత్య చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, వీసీకే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ దేవేందర్, ప్రధాన కార్యదర్శి చెరుపల్లి ఆనంద్, నాయకులు కిరణ్ కుమార్, భిక్షపతి, అనిల్, రవి, అరుణ, రాజేందర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి.. అడ్డదారి తొక్కి..

● గంజాయి విక్రయించడానికి వస్తూ పట్టుబడిన యువకులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

తొర్రూరు: జల్సాలకు అలవాటుపడిన యువకులు డబ్బు సరిపోకపోవడంతో అడ్డదారులు తొక్కారు. ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నారు. ఈ క్రమంలో విశాఖలో కొనుగోలు చేసిన గంజాయిని విక్రయించడానికి వస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. తొర్రూరు సీఐ వై. సత్యనారాయణ కథనం ప్రకారం తొర్రూరు పట్టణం అమ్మాపురం రోడ్డులోని కిరాణ మార్ట్ ఫంక్షన్ హాల్ వద్ద ఎస్సై గండ్రాతి సతీశ్ సిబ్బందితో కలిసి గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక లెనిన్‌నగర్‌కు చెందిన శివరాత్రి అనిల్, పార్క్ బజార్‌కు చెందిన చార్ల గణేశ్ బైక్‌పై వస్తూ అనుమానాస్పందంగా కనిపించారు. దీంతో వారిని తనిఖీ చేయగా ఎండు గంజాయి లభ్యమైంది. అనంతరం విచారించగా ఏపీలోని విశాఖలో కొనుగోలు చేసిన గంజాయిని తొర్రూరులో విక్రయిస్తున్నామని అంగీకరించారు. దీంతో వారి నుంచి రూ.40 వేల విలువైన 4 కిలోల ఎండు గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

● బయ్యారంలో మృతుడి కుటుంబీకుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు,మృతుడి కుటుంబీకులు

బయ్యారం : తమ కుమారుడి మృతికి తమ కోడలే కారణమని ఆరోపిస్తూ.. ఆమెకు పోలీసులు ఎందుకు రక్షణ కల్పిస్తున్నారని గార్ల మండలం పినిరెడ్డిగూడేనికి చెందిన మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు గురువారం బయ్యారంలో రాస్తారోకో నిర్వహించారు. గ్రామానికి చెందిన గుగులోత్ అరుణ్‌కుమార్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. అయితే పలు కారణాలతో తన కుమారుడిని హతమార్చేందుకు కోడలు అఖిల విషం ఇచ్చిందని అరుణ్ తల్లి రత్న గార్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. కాగా, అరుణ్‌కుమార్ మృతదేహాన్ని బయ్యారం తీసుకొచ్చే వరకు అఖిల పక్కనే ఉంది. అయితే అఖిల.. పినిరెడ్డిగూడెం వెళ్తే మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయని భావించిన పోలీసులు బయ్యారంలో ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న అరుణ్‌కుమార్ కుటుంబీకులు, గ్రామస్తులు బయ్యారం చేరుకొని అఖిలను తమతో పంపిస్తేనే మృతదేహం తీసుకెళ్తామని ఇల్లందు, మహబూబాబాద్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సమయంలో ఆందోళనకారుల పోలీసులపైకి వెళ్లే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో గార్ల-బయ్యారం సీఐ బాలాజీ మృతుడి బంధువులతో మాట్లాడి తామే అఖిలను తీసుకొచ్చి అంత్యక్రియల వరకు ఉంచడంతో పాటు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో బయ్యారం, గార్ల ఎస్ఐలు రమాదేవి, వెంకన్న పాల్గొన్నారు.

రైలులో బాలల అక్రమ రవాణా



పోలీసుల అదుపులో బాలలను అక్రమంగా తరలిస్తున్న ముఠా

● రక్షించిన పోలీసులు
● ఐదుగురిపై కేసు నమోదు

కాజీపేట రూరల్: బాలకార్మికులకు రైల్వే పోలీసులు విముక్తి కలించారు. రక్సోల్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్‌లో బాల కార్మికులను తరలిస్తున్న బీహార్ ముఠాను గురువారం అదుపులోకి తీసుకున్నారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ సంజీవరావు కథనం ప్రకారం ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, బేబీ బచ్‌పన్ ఆందోళన్ (బీబీఏ) చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూయూసీ) ఎన్జీవోస్ సంయుక్తంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ (ఏహెచ్‌టీ) డ్రైవ్ చేపట్టారు. కాగజ్‌నగర్-కాజీపేట వరకు రక్సోల్ ఎక్స్‌ప్రెస్‌లో డ్రైవ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కన్పించిన పిల్లలను, తరలించే ముఠాను అదుపులోకి తీసుకొని విచారించి కాజీపేటలో దింపినట్లు తెలిపారు. ఐదుగురు బీహార్ ముఠా వ్యక్తులు 18 ఏళ్ల లోపు 11 మంది పిల్లలను హైదరాబాద్‌లో బాలకార్మికులుగా పనిలోకి తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. పిల్లలను సీడబ్ల్యూయూసీకి అప్పగించి, తరలిస్తున్న ఐదుగురిపై జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ డ్రైవ్‌లో కాజీపేట ఆర్‌పీఎఫ్ ఏఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామగుండం ఆర్‌పీఎఫ్ సీఐ సురేశ్‌గౌడ్, జీఆర్‌పీ కాజీపేట ఎస్ఐ పరశురాములు, ఏహెచ్‌టీయూ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, బీబీఏ కో-ఆర్డినేటర్ నరేశ్, చైల్డ్‌లైన్ 1098 వసుంధర, సోమన్న, ఎన్జీవో కైలాశ్ పాల్గొన్నారు.